ప్రజాశక్తి

బుధవారం 8 అక్టోబరు 2025



శ్రీనిధి యాప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పాడేరు: శ్రీనిధి యాప్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పలువురు జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీనిధి యాప్ ని తయారు చేశారని తెలిపారు. ఈ యాప్ ద్వారా డ్వాక్రా మహిళలు, శ్రీనిధిలోన్ తీసుకున్న ప్రతి సభ్యురాలు బ్యాంకులకు వెళ్లకుండా తమ మొబైల్ లోనే తిరిగి చెల్లించవచ్చన్నారు. యాప్లో రీపేమెంట్ షెడ్యూల్ వివరాలు పొందుపరచబడ్డాయని తెలియజేశారు. ఈ యాప్ ద్వారా తిరిగి చెల్లించవలసిన డబ్బుని దుర్వినియోగం అవ్వకుండా చెల్లించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె.పద్మలత, డిఆర్డిఎ పిడి పి.మురళి, గ్రామ వార్డ్ సచివాలయం నోడల్ అధికారి పి ఎస్ కుమార్, శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి జయకుమార్, శ్రీనిధి మేనేజర్స్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే టూరిజాన్ని నడపాలి

- అటవీ భూములను రక్షించుకోవాలి
- కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తిఅరకులోయ రూరల్: ప్రభుత్వం ఆధ్వర్యంలోనే టూరిజం నడిపి అభివృద్ధి చేయాలని, దాని ద్వారా ఉపాధి పెరుగుతుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగ్‌రావు తెలిపారు. అరకులోయ మండల కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రైవేటు వ్యక్తులకు టూరిజంను అప్పగిస్తే పర్మినెంట్ ఉద్యోగాలు ఉండవన్నారు. గెస్ట్ హౌస్లు ప్రైవేట్ వాళ్లకు లీజుకు ఎలా ఇస్తారన్నారు. గిరిజన ప్రాంతాన్ని నాశనం కోసమే ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. 1/70 చట్టం ప్రకారం ప్రైవేట్ వ్యక్తులు వ్యాపారం చేసుకోవడానికి, రావడానికి వీలులేదన్నారు. ప్రభుత్వాలు ప్రైవేటు వ్యక్తులకు విస్తారంగా భూములు కట్టబెట్టడానికి, 1/70 చట్టం అమలు చేయకుండా గిరిజన హక్కులు చట్టాలు తుంగల్లో తొక్కి ప్రైవేటు వ్యక్తులకు కొమ్ముకాస్తున్నారన్నారు. అడవులు, భూములను గిరిజనులు రక్షించుకోవాలని, ప్రైవేటుపరం చేస్తామంటే గిరిజనులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. సిఐటియు కార్మిక వర్గం, గిరిజనుల పక్షాన ఉంటుందని, నిరంతరం పోరాడుతుందన్నారు. గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగానే పని చేస్తున్నారని పర్మినెంట్ చేయలేదన్నారు. ఐటీడీఏ పరిధిలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు, స్కీం వర్కర్లను ఎందుకు రెగ్యులరైజేషన్ చేయట్లేదని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతంలో లక్షల మంది కార్మికులు ఉన్నారని కనీసం ఈఎస్ఐ ఆసుపత్రి ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. భవిష్యత్తులో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు పెద్ద ఎత్తున ఈ ప్రభుత్వ విధానంపై తిరుగుబాటు చేస్తారన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు భూములు ఇవ్వడానికి హక్కు ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. హైడ్రో ప్రాజెక్ట్ రద్దు చేయాలని లేకపోతే భవిష్యత్తులో గిరిజనులు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. గిరిజన ప్రాంతంలో పనిచేసే కార్మికులను కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వ హయంలో సుమారు రెండు లక్షల మంది నిరుద్యోగులను వాలంటరీ వ్యవస్థ తీసుకొచ్చిందని , కూటమి ప్రభుత్వం వారిని తొలగించడంతో రోడ్డున పడ్డ పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం వారిని విధుల్లోకి తీసుకొని వారికి జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పని గంటల పెంపుపై ఉద్యమాలు

- -కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు
- -కార్మికులకు అండగా ఉంటాం -ఎన్నికల హామీలు అమలు చేయాలి
- -సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కోటేశ్వరరావు, వేదికపై నర్సింగరావు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: హైడ్రో ప్రాజెక్ట్ పేరుతో నవయుగ, అదానీ కంపెనీలకు చెందిన వ్యక్తులు గిరిజన ప్రాంతంలో వస్తే తరిమికొట్టాలని, కార్మికులకు పెంచిన 12 గంటల తగ్గించకుంటే ప్రభుత్వానికీ తగిన బుద్ధి చెప్తారని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు హెచ్చరించారు. అల్లూరి జిల్లా అరకులోయ మండలకేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపంలో కె.సర్బన్న ప్రాంగణంలో సిఐటియు అల్లూరి జిల్లా రెండవ మహాసభ రెండు రోజులపాటు ఘనంగా జరిగింది. ఈ మహాసభకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కోటేశ్వరరావు హాజరై మహా సభ ను ఉద్దేశించి మాట్లాడారు. ఎంత మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని దినాన్ని కూటమి ప్రభుత్వం 12 గంటలు పెంచడమంటే కార్మికుల మీద ఎంతో వివక్షత చూపుతున్నారో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. కార్మికులకు అనుకూలంగా చట్టం చేయవసిన ప్రభుత్వం చేయకుండా కార్పొరేట్ కు అనుకూలంగా చట్టం చేస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టం, పేసా గ్రామసభ అనుమతి లేకుండా అడవులు భూములు, అదానీ, నవయుగ కంపెనీలకు భూములు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా కట్టబెడతారని మండిపడ్డారు. గిరిజనులు అడవిని నమ్ముకుని కొండల్లో మొక్కలు, పంట పొలాలు, భూములు, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి గిరిజనులు జీవనం సాగిస్తున్నారని, గిరిజనులు బతుకుల మీద దెబ్బ కొడతామంటే ఊరుకోరని, వారికి సిఐటియు అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఆదివాసి ప్రాంతంలో డిగ్రీలు, బిఈడి, పీజీలు చదివి అనేక మంది నిరుద్యోగులు ఉన్నారని, ఐటీడీఏ పరిధిలో వేలాది బ్యాక్లాగ్ పోస్టులు ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో బాక్సైట్ తవ్వాలని ప్రభుత్వాలు అనేక ప్రయత్నాలు చేశాయని, భారీ ఎత్తున పోరాటం చేసి ఆపిన ఘనత గిరిజనులకు ఉందన్నారు. గిరిజన ప్రాంతంలో హైడ్రో ప్రాజెక్ట్ పేరుతో ఆదానీ నవయుగ కంపెనీలో వ్యక్తులు వస్తే అడుగ ుపెట్టనివ్వకుండా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికులకు, కష్టజీవులకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, సిపిఎం జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్బి పోతురాజు, కె.భాగ్యవతి, జె.భగాత్రం, జీనబంధు, ఎల్.సుందర్రావు,కె మోస్య ,జి.సత్యనారాయణ, కె శంకర్, డి.నాగమ్మ, రేణుక, రవి ,బాలన్న, రాజకుమార్, ప్రసాద్, కొండమ్మ, కొండలరావు, కళావతి, మంజుల, కొండమ్మ, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన నాయకులు



సభలో ఘర్షణ పడుతున్న టిడిపి, వైసిపి నేతలు

రసాభాసగా గ్రామసభ

టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక పంచాయతీ కార్యాలయం లో మంగళవారం జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. వాల్మీకి జయంతి సందర్భంగా సర్పంచ్ మంగా బొజ్జయ్య అధ్యక్షతన 'ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామసభలో గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, అమలు విధానాలపై ముఖ్యులు మాట్లాడారు. వైస్ ఎంపిపి కొమ్మిశెట్టి బాలకృష్ణ మాట్లాడుతూ వాలంటరీ వ్యవస్థ, ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. వార్డు సభ్యుడు చక్రపాణి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, సభ రాజకీయ వేదిక కాదని, సంబంధిత అంశాలపైనే మాట్లాడాలని సూచించారు. బాలకృష్ణ ఆగ్రహంతో ప్రతిస్పందించడంతో పరిస్థితి ఉద్రిక్తమైంది. సభలో ఉన్న టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు పెంటపాటి అనంత మోహన్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నం చేశారు. అయితే బాలకృష్ణ తగ్గకపోవడంతో మరింత రసాభాసగా మారింది.తరువాత సిడిపిఒ ఉమా జోక్యం చేసుకుని ఇరువర్గాల వారిని శాంతింపజేశారు. అనంతరం అనంత మోహన్, వార్డు సభ్యుడు చక్రపాణి ప్రభుత్వంపై అనవసర విమర్శలు సహించబోమని హెచ్చరించగా, సభ తిరిగి సాధారణ స్థితికి వచ్చింది. కార్యక్రమంలో సర్పంచ్ కన్నబాబు, వార్డు సభ్యులు రమణి, శ్యామల, గౌరమ్మ, రామలక్ష్మి, కార్యదర్శి మల్లేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో మంగళవారం భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి ఎండ తీక్షణంగా కాసింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై అనంతరం అరగంటసేపు కుండపోత వర్షం కురిసింది.

జగన్ పర్యటన విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -కొయ్యూరు : ఈనెల 9న మాకవరపాలెంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీ పర్యటన విజయ వంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు. కొయ్యూరు మండలంలో ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ సందర్భం గా విలేకరులతో మాట్లాడుతూ 9వ తేదీన పాడేరు నియోజకవర్గం 5 మండలాల ఎంపిటిసిలు, జెడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, సర్పంచులు, పార్టీ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అనుబంధ విభాగాల్లో నియమితులైన నాయకులు, మాజీ చైర్మన్‌లు, డైరెక్టర్లు వార్డు సభ్యులు అంతా హాజరు కావాలన్నారు. జి.మాడుగుల జెడ్పిటిసి మత్స్యరాస వెంకటలక్ష్మి కొయ్యూరు ఎంపిపి బడుగు రమేష్, చింతపల్లి ఎంపిపి అనూష పాల్గొన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: గ్రామ పంచాయతీ నిధులతో గసబ గ్రామంలో రూ 4లక్షలతో పాఠశాల భవనం నిర్మాణం చేపట్టారు. పూర్తయిన భవనాన్ని మంగళవారం పంచాయతీ సర్పంచ్ పి సునీత, ఎంపీటీసీ ఘనంగా ప్రారంభం చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ, పంచాయతీ నిధులు కేటాయించి పాఠశాల భవనం నిర్మాణం చేశామని చెప్పారు. తాగు నీరు, వీధి దీపాలు, పారిశుధ్య పనులకు నిధులు కేటాయించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, వార్డు సభ్యులు పి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో గ్రామ సచివాలయ సిబ్బంది అధ్యక్ష కార్యదర్శుల నూతన కార్యవర్గ ఎన్నికను మంగళవారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళ్యాణ మండపం వద్ద ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది అధ్యక్షుడిగా నాయుడు పద్మారావు (బూసిపుట్టు వీఆర్వో) కార్యదర్శిగా చెండా గంగాధర్ నియమితులయ్యారు . ఉపాధ్యక్షులుగా ఎస్ కృష్ణారావు, ఎస్ లావణ్యలు, కో కన్వీనర్లుగా ఎల్ మనోహర్, ఏ స్వామి నాయుడు, ఈశ్వరమ్మ లను ఎన్నుకున్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది మహిళా అధ్యక్షురాలుగా జి జ్యోష్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే భార్గవి శైలజ, వి.మన్మోహన్, కే సుజాత, కోశాధికారిగా రవి రాజ్, డిప్యూటీ కార్యదర్శి లతోపాటు క్రమశిక్షణ కార్యదర్శిలను ఎన్నుకున్నారు.



ఎన్నికైన సిబ్బంది

పోడు పట్టాలపై గ్రామసభ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: కొండపోడు వ్యవసాయం సాగు చేస్తూ అర్హులైన గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేసేందుకు గాను స్థానిక కంద్రుమ్ పంచాయతీలో ఆ పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ల పోరం మండల అధ్యక్షుడు కే.హరి ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 37 మంది లబ్ధిదారులను గుర్తించి సభలో తీర్మానం చేసి సంబంధిత అధికారులకు పంపించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఎం కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ కే.ప్రతిమ, వార్డు సభ్యులు కృష్ణ, పీసా ఉపాధ్యక్షుడు కే.సద్దు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్




మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ తదితరులు

సిపిఎం నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు

- సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి- విఆర్.పురం: సిపిఎం నాయకులపై పాయం వెంకయ్య అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మరోసారి ఇలా చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సిపిఎం నాయకులు హెచ్చరించారు. మండలంలోని రేఖపల్లి బొప్పెన భీమయ్య కార్యాలయంలో మంగళవారం పంకు సత్తిబాబు అధ్యక్షతన సిపిఎం నాయకులు సమావేశం నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, కారం సుందరయ్య, మండల నాయకులు పులి బుజ్జి ఆసు లక్ష్మయ్య మాట్లాడుతూ పాయం వెంకయ్య సిపిఎంపై, సిపిఎం నాయకులపై ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే సహించేది లేదని మా మంచితనాన్ని చేతగానితనంగా చూడొద్దని హెచ్చరించారు. విమర్శలు శ్రుతిమించితే ఎవరూ చూస్తూ ఊరుకోరన్నారు. ప్రతిరోజు కావాలని సిపిఎం మీద రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ఆయన బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మండల నాయకులు తోడంరాజు చిక్కాల రామారావు, , గొర్రె రాజు, సర్పంచ్ వెట్టి లక్ష్మి, హజరత్, కుంజ కన్నయ్య, సోడి. మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



తరగతులు పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ కల్పనారెడ్డి

పిల్లల స్థాయికనుగుణంగా బోధన

ప్రజాశక్తి-అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో జెడ్పి స్కూల్‌లో 6 రోజుల పాటు ఉపాధ్యాయులకు టరల్ శిక్షణ నిర్వహిస్తున్న సంగతి విధితమే. మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని స్టేట్ అబ్జర్వర్ కల్పనారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న వివిధ బోధన అంశాలన్నిటిని పాఠశాల స్థాయిలో పిల్లవాడి స్థాయిని బట్టి బోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 కె.రమేష్, ఎంఇఒ -2 శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు వెంకటలక్ష్మి, ఆనంద బాబు, ప్రసాద్, సిఆర్‌పి రమణ, రవికుమార్, ట్రైనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు చేయూత

ప్రజాశక్తి - జికె వీధి : మండలంలోని పెదవలస పరిధి 16 డ్వాక్రా సంఘాలకు 3 కోట్ల 20 లక్షల రుణాలు మంజూరు చేశారు. వెలుగు ఎపిఎం సూర్యారావు, కేడీపేట ఇండియన్ బ్యాంక్ మేనేజర్ జీవన్, కూటమి నాయకులు పాల్గొన్నారు. గత సంవత్సర కాలంగా ఆరుకోట్లు లోన్లు మంజూరు చేశామన్నారు. తీసుకున్న లోన్లు సకాలంలో చెల్లించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ శశికుమార్, పెదవలస సిసి సత్యబాబు రాజబాబు, వైస్ ఎంపిపి సర్పగడ్డ ఆనంద్ పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలతో మేనేజర్

ప్రాసెసింగ్ యంత్రాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-పాడేరు: కేంద్ర ప్రభుత్వం స్పైసెస్ బోర్డు సహకారంతో గిరిజన రైతులకు రాయితీపై మిరియాలు, పసుపు, అల్లం, చింతపండు వలిచే యంత్రాలు, శుభ్రపరిచే యంత్రాలు పంపిణీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిరియాలు వలవడానికి, ఎండబెట్టిన తరువాత శుభ్రం చేయడానికి ఉపయోగ పడే యంత్రాలను, పసుపు ఆవిరి పై ఉడకబెట్టు, పోలిష్ చేయు యంత్రాలు, చింతపండు పిక్క తీసే యంత్రాలు, అల్లం శుభ్రపరిచు, ముక్కలు చేసే, ఎండబెట్టే యంత్రాలు గిరిజన రైతులకు 75 శాతం రాయితీపై అందిస్తామన్నారు. ఈ యంత్రాలు, విద్యుత్తు, డీజిల్, పెట్రోల్ సహాయంతో పనిచేస్తాయన్నారు. ఈ యంత్రాలు తో పాటు మిరియాలు కోసే నిచ్చెనలు, టార్పాలిన్ షీట్స్‌ను ఒక యూనిట్‌గా రాయితీతో అందిస్తున్నామన్నారు. మిరియాలు, అల్లం, పసుపు మరియు చింతపండు సాగు చేస్తున్న గిరిజన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 90 శాతం రాయితీపై అందిస్తామన్నారు. ఆర్గానిక్/ఇండిగాప్(ఇండ్గాప్) సర్టిఫికేషన్‌కు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 50 శాతం రాయితీపై అందిస్తామన్నారు. రైతులకు వానపాముల ఎరువు తొట్టెలకు (వెర్మి కంపోస్ట్ ట్యాంక్) 75 శాతం రాయితీని అందిస్తామన్నారు. ఐటిడిఏ పాడేరు లో స్పైసెస్ బోర్డు కార్యాలయం లో అక్టోబరు 25వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలని కోరారు. రఖాస్తులకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, కులదవీ కరణ పత్రం, బ్యాంకు పాసు పుస్తకం మొదటి పేజీ, పోడు పట్టా లేదా భూమి పట్టా జెరాక్స్ కాపీలను (కనీసం 25 సెంట్లు భూమి), తెల్ల రేషన్ కార్డు, మొబైల్ ఫోన్ నంబరు, 2 పాస్ పోర్టు సైజు ఫోటో లను ు జత చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయ పనివేళ లో ఫోన్‌నెంబర్ :8919475787కు సంప్రదిం చాలని తెలిపారు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం పాడేరు మండలం గుత్తులు పుట్టు గ్రామం ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో సూపర్ 50 విద్యార్థుల మూడవ బ్యాచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరిలో ఏదో ఒక స్కిల్ దాగివుందన్నారు. మీలో ఒక విధమైన టాలెంట్ ఉన్నందున ఎంపిక అయ్యారన్నారు.సబ్జెక్ట్ పై పట్టుసాధించడమే కాకుండా ప్రెజెంట్ చేయడం చాలా కీలకమన్నారు. చిన్న చిన్న గ్రూప్ లుగా ఏర్పడి సబ్జెక్ట్‌లపై చర్చించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు పి.బి.కె పరిమళ, ఏటిడబ్ల్యూ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరిలో భారీ వర్షం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మంగళవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ కుండపోత వాన కురిసింది. ఉదయం 10 గంటలకు మొదలై మధ్యాహ్నం రెండు గంటల వరకు ఏకధాటిగా గంటల తరబడి కురవడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి.



13న మహాధర్నాను జయప్రదం చేయండి

ఆదివాసీ హక్కులు ఉద్యోగాల సాధన కమిటీ గౌరవాధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి




మాట్లాడుతున్న ఈతపల్లి సిరిమల్లిరెడ్డి

ప్రజాశక్తి - రంపచోడవరం : ఈ నెల 13న జరిగే చలో ఐటిడిఎ రంపచోడవరం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసి హక్కులు ఉద్యోగాల సాధన కమిటీ, గౌరవ అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లిరెడ్డి పిలుపు నిచ్చారు. వేములకొండ పంచాయతీ కాకవాడలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. శతశాతం ఉద్యోగాలు ఆదివాసులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రంపచోడవరం మండల అధ్యక్షులు సాదల విద్యాసాగర్ పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: ఏజెన్సీ ప్రాంతంలో శతశాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించాలని, ఆదివాసీల హక్కులు చట్టాలు పటిష్టంగా అమలు చేయాలనే డిమాండ్లతో ఈ నెల 13న చింతూరు ఐటిడిఎ వద్ద జరిగే మహాధర్నా జయప్రదం చేయాలని ఆదివాసీ నిరుద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో అన్నవరంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆదివాసీ నిరుద్యోగ సంఘ మండల నాయకులు బీరబోయిన గౌతమ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పాయం లక్ష్మణరావు మాట్లాడుతూ అరకు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. ఏజెన్సీలో స్థానిక ఉద్యోగాలు స్థానిక ఆదివాసులతోనే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని లేకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పీసా అధ్యక్షులు బురక మారయ్య , సోడె సత్తిబాబు, ఆదివాసీ నిరుద్యోగ సంఘ మండల నాయకులు పాయం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఆదివాసీ నిరుద్యోగ సంఘం నాయకులు



కొమరంభీమ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుంజు అనిల్ తదితరులు

కొమరం భీమ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి-కూనవరం: కొమరం భీమ్ ఆశయ సాధనకై నేటి ఆదివాసీ యువతరం ఉద్యమించాలని, ఆదివాసీ జెఎసి రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ పిలుపునిచ్చారు. కొమరం భీమ్ వర్ధంతి సందర్భంగా స్థానిక కూనవరం మండలం కోతులగుట్టలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సోడే ముత్తయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు మాట్లాడుతూ కొమరం భీమ్ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెబ్బులిలా పోరాడారని, పశువుల కాపర్లపై విధించిన సుంకాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో అందరిని ఐక్యం చేస్తూ పోరాటాన్ని సాగించారని ఈ పోరాట పటిమ ప్రతి ఆదివాసీ అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో జెఎసి డివిజన్ నాయకులు మదల చంటి, ఆదివాసీ ఉపాధ్యాయులు చిచ్చడి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.




సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలు

కనీస వేతనాలు చెల్లించాలి

- ఆశా వర్కర్ల ఆందోళన

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని కూటూరు, కూనవరం పిహెచ్‌సిల ముందు ఆశావర్కర్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సూపర్‌వైజర్లకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు పాయం సీతారామయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, టిఎ. డిఎలు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నా యని విమర్శించారు. 5జి మొబైల్స్, సిమ్ కార్డులు ఇవ్వాలని కోరారు. నాణ్యమైన యూనిఫాం ఇవ్వాలని అంత్యక్రియల ఖర్చులకు 20, 000లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు యర్రం శెట్టి రేణుక, కార్యదర్శి కారం సుజాత, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటు బాధిత రైతులకు పరామర్శ



కోడువలసలో రైతులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధి కోడువలసలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మంగళవారం పర్యటించారు. కోడువలస గ్రామంలో ఇటీవల పిడుగు పడి 20 పశువులు మృతి చెందిన నేపథ్యంలో బాధిత రైతులను ఎమ్మెల్యే పరామర్శించారు. దుక్కి పశువులు మృతి చెందడంతో ఆర్థికంగా నష్టపోయామని ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి బాధిత పదిమంది రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఐంబలితో వెళ్లి రైతు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి తారురోడ్డు సదుపాయం కల్పించాలని, వేసవిలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంటుందని బోర్వెల్ మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. అనంతరం పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పశుసంవర్ధక శాఖ ఏడి కిషోర్, డిప్యూటీ తహశీల్దార్ రంగారావు, వైసిపి మండల అధ్యక్షులు మజ్జి చంద్రబాబు, వంతల అప్పారావు, మాణిక్యం, నాగరాజు, పంచాయతీ నేతలు పాల్గొన్నారు.

దండకారణ్య ఎడ్యుకేషన్ సొసైటీకి పురస్కారం



అవార్డు అందుకుంటున్న శ్రీను మాస్టార్

ప్రజాశక్తి-అరకులోయ: స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలు 2025లో భాగంగా దండకారణ్య విద్యాభివృద్ధి సంస్థ ఉత్తమ స్వచ్ఛ ఎన్జిఓ పురస్కారాన్ని అందుకుంది. ఈ సంస్థ గత 25 సంవత్సరాల నుండి విద్యతో పాటు అవగాహన కార్యక్రమాలు అరకు వేలి కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మూలించడంలో కీలకపాత్ర పోషిస్తూ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. గంజాయి రహిత సమాజాన్ని నిర్మించడంలో రాష్ట్రస్థాయిలో ఉన్న ఈగల్ టీంతో కలిసి అవగాహన కార్యక్రమాలు చేపడుతుంది.గిన్నిస్ రికార్డు సాధించిన 108 యోగ ఆసనాలు నిర్వహించిన ప్రాంతంలో పరిశుభ్రతలో 200 మంది వాలంటీర్లను ఉచితంగా అందించింది.ఈ కృషికి ఫలితంగా దండకారణ్య ఎడ్యుకేషన్ సొసైటీకి ఉత్తమ స్వచ్ఛత ఎన్జిఓ పురస్కారం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా దండకారణ్య ఎడ్యుకేషన్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీను మాస్టారు ఈ పురస్కారం అందుకున్నారు. తమ సేవలను గుర్తించి స్వచ్ఛత పురస్కారం అవార్డును అందించిన అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్,ఐటీడీఏ పీఓ,డిప్యూటీ కలెక్టర్,జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ లకు వ్యవస్థాపకుడు శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. దండకారణ్య ఒకేషనల్ ఎడ్యుకేషనల్ సొసైటీకి పురస్కారం దక్కడంపై కాలేజ్ హాస్టల్ వార్డెన్ రాజేంద్ర కుమార్ తదితరులు అభినందించారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు: మండలంలో అన్ని యాజ మాన్యాల పాఠశాలల విద్యార్థులకు మంగళవారం వాలీబాల్, కబడ్డీ, ఖో- ఖో, షటిల్ చెస్, యోగ, అథ్లెటిక్స్ తదితర క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టాబ్బాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలతో ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. క్రీడలలో మంచిగా రాణిస్తే ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు.ఎస్జిఎఫ్ సెక్రెటరీ పాంగి సూరిబాబు మాట్లాడుతూ, ఈ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన వారిని డివిజన్ స్థాయికి, జిల్లా స్థాయికి పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హైడ్రో' అనుమతులు రద్దు చేయాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు భూములు ఇవ్వడానికి ప్రభుత్వానికి హక్కు ఎవరిచ్చారని, ఈ ప్రాజెక్టు అనుమతులు రద్దుచేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా అరకులోయ మండల కేంద్రంలోని టిటిడి కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైడ్రో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గిరిజనులు తిరగబడుతున్నారని, ఎక్కడ మీటింగ్ పెట్టినా వేలాది సంఖ్యలో కదులుతున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ రద్దు చేయకపోతే భవిష్యత్తులో గిరిజనులు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలోనే టూరిజం నడవాలని, దాని ద్వారా ఉపాధి పెరుగుతుందని చెప్పారు. ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తే పేదల పొట్టలు కొడతారని, ఉద్యోగులు, పర్మినెంట్ ఉండవన్నారు. రూ.వందల కోట్లు ఖర్చుపెట్టి ప్రభుత్వం గత 25 ఏళ్లుగా నిర్మించిన గెస్ట్ హౌస్లను ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

అడవులు, భూములను రక్షించేది గిరిజనులని, అడవిని, ఆ భూములను ప్రైవేటుపరం చేస్తేమాటే గిరిజనులు ఊరుకోరని హెచ్చరించారు. దీన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, గిరిజనుల పక్షాన కార్మిక వర్గం ఉంటుందని, నిరంతరం పోరాడుతుందని స్పష్టంచేశారు. గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జీవితమంతా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగానే పని చేస్తున్నారని, పర్మినెంట్ చేయడం లేదని తెలిపారు. ఐటిడిఏ పరిధిలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, స్కీం వర్కర్లను ఎందుకు రెగ్యులరైజేషన్ చేయట్లేదని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతంలో లక్ష మంది కార్మికులు ఉన్నారని, కనీసం ఇఎస్ఐ ఆసుపత్రి పెట్టడం లేదని తెలిపారు.

విశాఖ స్టీల్ప్లాంట్ 79 శాతం ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. మోసపూరిత మాటలతో కార్మికులను మోసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే సుమారు 7 వేల మంది ఉద్యోగులు, కార్మికులను తొలగించారని, కార్మికులను తొలగిస్తే ఉత్పత్తి ఎలా పెరుగుతుందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు రద్దుకు ఏకగ్రీవ తీర్మానం



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత బాలదేవ్

ప్రజాశక్తి -అరకు లోయ: రాష్ట్ర ప్రభుత్వం ఏక పక్షంగా చిట్టంవలస హైడ్రో పవర్ ప్రాజెక్టు నవయుగ బడా కంపెనీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చెయ్యాలని బస్కి పంచాయితీలో జరిగిన గ్రామసభలో ఆదివాసీలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బస్కి పంచాయితీ కేంద్రంలో జరిగిన గ్రామ సభలో సర్పంచ్ పాడి రమేష్ అధ్యక్షతన జరిగింది.గ్రామ సభలో హాజరైన ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుగ్గుడు, కృష్ణర్ పెసా కమిటీ కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, ఆదివాసీ ప్రాంతం ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ ఏరియాలో ఆదివాసీ హక్కులు, చట్టాలు ఉల్లంఘించి రాష్ట్ర ప్రభుత్వం నవయుగ బడా కంపెనీకి చిట్టం వలస హైడ్రోపవర్ ప్రాజెక్ట్ 800 మెగావాట్లు కరెంటు ఉత్పత్తి కోసం జీవో 13 జారీ చేసిందన్నారు. చిట్టంవలస హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఎగువ డ్యామ్ నిర్మాణం కోసం బస్కీ పంచాయితీ గిర్లిగూడ, ఇరుకుగూడ మధ్యన 177 ఎకరాలు డ్యామ్ నిర్మాణం కోసం నవయుగ కంపెనీ సరిహద్దు దిమ్మలుపాతారని ఐదవ షెడ్యూల్ భూభాగంలో ఆదివాసులు మాత్రమే భూ యజమానులని ప్రైవేట్ బడా నవయుగ కంపెనీకి భూ యాజమాన్య హక్కు చెల్లదని ఆదివాసీ హక్కులు,చట్టాలు ఉల్లంఘించి గ్రామపంచాయతీ పాలకవర్గం, పెసా ఆదివాసీ గ్రామసభల కనీసం సంప్రదించకుండా నవయుగ కంపెనీ సరిహద్దు దిమ్మలు పాతిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.బస్కీ పంచాయితీ గ్రామసభలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు జీవో 13 తక్షణమే రద్దు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. ఈ గ్రామ సభలో అరకువేలి మండల వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మాజీ ఎంపీటీసీ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ బురిడి దశరథ్, మాజీ సర్పంచ్ కొర్రా సోమరాజు, మాజీ ఎంపీటీసీ సూకరాజు, పెసా కమిటీ సభ్యులు కొర్రా మాణిక్యం, పొత్తి, పోరాట కమిటీ నాయకులు సమర్డి లైచోన్, పాంగి బాబూరావు, సమర్డి బుజ్జి బాబు,ఉప సర్పంచ్ వార్డు వార్డు సభ్యులు, అధిక సంఖ్యలో ఆదివాసులు పాల్గొన్నారు.

బోరు బావి ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -చింతపల్లి : చింతపల్లి డిగ్రీ కళాశాల గర్ల్స్ హాస్టల్లో రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో బోరు నిర్మాణ పనులకు ఎంపిపి అనూష దేవి మంగళవారం భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ విద్యార్థినులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేందుకు బోరు నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి ఎంపిపీని సన్మానించారు.ఎంపీటీసీ చిందాడ జయలక్ష్మి కో ఆప్షన్ సభ్యులు నాజర్ వలి, హాస్టల్ వార్డెన్లు పద్మావతి, వినాయకరావు, గ్రంథాలయ అధికారి జగత్ రాయ్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి

గ్రామసభల్లో అభివృద్ధి పనుల గుర్తింపు



ముంచంగిపుట్టులో సమస్యలు చెపుతున్న నేతలు

ప్రజాశక్తి అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ఆది కర్మయోగి అభీయాన్ కొత్త పథకం ద్వారా గ్రామ అభివృద్ధి మెరుగు పడుతుందని స్థానిక సర్పంచ్ సోమ్మెల .రూతు, సచివాలయం సెక్రటరీ చిట్టం. దేవలు అన్నారు. మంగళవారం అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామంలో సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో సభను నిర్వహించారు.జీఎస్టీ పోస్టాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్, సెక్రటరీ లు మాట్లాడుతూ, అనంతగిరి పెద్దూరు రాజుపాక. తేనెపుట్టు. తెల్లరపాడు గ్రామాలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ శేఖర్ బాబు, డిఎ కుసుమ, మహిళ పోలీసు కె.సునీతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్ .కుమరి, గిరిజన సంఘం మండల నేత ఎస్.నాగులు, పేసా కమిటి అధ్యక్షుడు ఎన్.చిన్నగంగులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం గ్రామ పంచాయితీలో సర్పంచ్ కొర్ర త్రినాథ్ అధ్యక్షతన ఆది కర్మ యోగి , పీఎం జన్ మన్ యోజన గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా కొర్రా.త్రినాధ్ మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలో ఆది కర్మ యోగి గ్రామాలను గుర్తించి రోడ్డు, డ్రైనేజీ, మంచి నీరు, అంగన్వాడీ, కమ్యూనిటీ, పాఠశాల భవనాలకు నివేదికను తయారు చేశామన్నారు.ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేస్తే గ్రామాలలో అన్ని రకాలుగా అభివృధి చెందుతుందనీ తెలిపారు. సెక్రటరీ గలీత్ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరిచి ఆరోగ్య వంతంగా ఉండడానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ వి.సాధురామ్, వార్డు సభ్యులు ఎస్.సోద, కె.గోపాల్, త్రినాధ్, బలరాం, సుబ్బారావు, పిసా వి.నీలకంఠం,నాగరాజు,ఆనంద్,సుబ్బారావు, మలేష్ పాల్గొన్నారు.

ముంచింగి పుట్టు : మండలంలోని కరీముఖిపుట్టు పంచాయితీ నందిమెట్ట, మెరకచింతలో పీఎం జన్మన్ , ఆది కర్మయోగి గ్రామసభలో సిపిఎం మండల నాయకులు గల్లెల జీనబంధు, గలేల్ల సీతారాం పాల్గొన్నారు. నందిమెట్టలో సమస్యను లేవనెత్తి ప్రశ్నించారు.ప్రభుత్వం నాడు నేడు పేరుతో సుమారుగా 12 లక్షల స్కూల్ బిల్డింగ్ నిర్మాణం కోసం మంజూరు చేయడం జరిగిందని, పిల్లర్స్ లెవెల్ లోనే పనులు నిలిచిపోయాయన్నారు. పాఠశాల భవనం నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల భవనం లేక విద్యార్థులు సుమారుగా 10 సంవత్సరంగా ఒక రేకుల షెడ్డులో చదువుతున్నారన్నారు.

ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యత



పి.శ్రీనివాసరావు, డిఎం

ప్రజాశక్తి-చింతపల్లి : ప్రయాణికుల భద్రతతో పాటు సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శ్రీనివాసరావు అన్నారు. చింతపల్లి ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాంప్లెక్సుకు చెందిన భూమి సరిహద్దులను స్థానిక ట్రాఫిక్ గైడ్ ఎం.గణేష్ను అడిగి తెలుసుకున్నారు. కాంప్లెక్స్లో షాపులను, సిబ్బంది విశ్రాంతి గదులను, ఆన్లైన్ టికెట్ కౌంటర్ను, ఆర్టీసీ పార్సిల్ సర్వీసులను క్షుణ్ణంగా పరిశీలించారు. పార్సిల్ రవాణా, భద్రత, డెలివరీ సమయాలను అడిగి తెలుసుకున్నారు. కాంప్లెక్స్లో తాగునీటి సౌకర్యం, ప్రయాణికుల మరుగుదొడ్లను పరిశీలించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ చింతపల్లి కాంప్లెక్స్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. పెరుగుతున్న ప్రయాణికుల సౌకర్యార్థం అదనంగా కొత్త కుర్చీలను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. కాంప్లెక్స్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలకు అనుమతి లేదన్నారు. రాత్రి వేళల్లో ఆకతాయిల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు శాఖ సహాయం కోరతామన్నారు. కాంప్లెక్స్ వెలుపల ప్రహరీ గోడకి ఆనుకుని ప్రధాన రహదారి పక్కన ఆక్రమించిన దుకాణలను రెవెన్యూ అధికారుల సహాయంతో తొలగిస్తామని తెలిపారు. పెరుగుతున్న ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని పాడేరు డిపోలో బస్సుల సంఖ్య పెంచాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశామని చెప్పారు.

జిఎస్టిపై అవగాహన సదస్సు



కొయ్యూరు: సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కొయ్యూరు : రావణాపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు జిఎస్టిపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు ఉపాధ్యాయురాలు మృదు భాషిణి తెలిపారు. వ్యాసరచన, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బాలమురళికృష్ణ, 33 పంచా యతీల కార్యదర్శులు టిఎస్అధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక ప్రభుత్వడిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర, అర్థశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం తెలిపారు. జిఎస్టి పరిశీలకులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: జిఎస్టిపై టిడిపి నేతలు మండల కేంద్రంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జీసీసీ చైర్మన్ కె శ్రావణ్ కుమార్, ఆర్టిసి చైర్మన్ ఎస్.దొన్నుదొర మండల కేంద్రంలోని కిరాణా షాపుల్లో జీఎస్టీపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనిస వేతన సంఘం డైరెక్టర్ టి సుబ్బారావు, అధ్యక్షుడు కె ఆనంద్, ఎంపీటీసీ గీత, నాయకులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండించాలి

ప్రజాశక్తి -సీలేరు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్పై న్యాయవాది రాకేష్కిషోర్ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు అల్లూరి జిల్లా కాంగ్రెస్ డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఖజురహోలోని విష్ణు విగ్రహం పునరుద్ధరణపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం పెంచుకున్న న్యాయవాది రాజేష్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడికి యత్నించడం శోచనీయమన్నారు. ఇలాంటి సంఘటనలు చూస్తుంటే మనం ఏ నాగరిక సమాజంలో ఉన్నామో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాకేష్ లాంటి ఉన్మాదులను చట్టపరంగా తీవ్రంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

ఉపాధి వేతనదారులు ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి- విఆర్పురం: మండలంలో ఉపాధి వేతనదారులంతా ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గర ఇకెవైసి చేయించుకోవాలని అదనపు కార్యక్రమ అధికారి ఎం.రెడ్డిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకూ కొంతమంది ఇకెవైసి చేయించుకోలేదని, ఉపాధిహామీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ నెల 8వ తేదీలోపు చేయించుకోవాలని లేదంటే కార్డులు తొలగించబడతాయని తెలిపారు.

అండర్ -14, అండర్ -17 పోటీలకు ఎంపిక



హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి - మారేడుమిల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యం లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మండల నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం అండర్- 14, అండర్ -17 బాల బాలికలకు సెలక్షన్లు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, కోకో, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగ, అథ్లెటిక్స్, షాట్పుట్, జెవిలియన్ డిస్కో త్రో, 100, 200,400,600,800 టర్నింగ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ విద్యా కమిటీ చైర్మన్ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షులు గురుకు శేషకుమార్, రాష్ట్ర నూర్ భాషా కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, మాజీ మండల అధ్యక్షులు బీశెట్టి అప్పాజీ, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మల్లా దుర్గాప్రసాద్, ఎంఈఓ -2 కే ముత్యాలరావు, హెచ్ఎం ఈశ్వర్దేవి, మండల కో ఆర్డినేటర్ కోటేశ్వర రావు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సుదర్శన్, మండల పిడిలు, పిఇటిలు సుమారు రెండు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్మీకికి ఘన నివాళులు



రంపచోడవరం: నివాళులర్పిస్తున్న ఐటిడిఏ సిబ్బంది



మారేడుమిల్లి: మండల వాల్మీకి కమిటి నాయకుల నివాళులు

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రపంచంలోనే వాల్మీకి రామాయణం గొప్ప కావ్యమని ప్రతి వ్యక్తి రామాయణం చదవాలని రంపచోడవరం ఐటిడిఎ ఎపిఒ జనరల్ డిఎన్వి. రమణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయ సమావేశపు హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో, సిబ్బందితో వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి రామాయణం విలువలు ఇతరులకు తెలియజేయాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ డేవిడ్, ఎస్ఒ మార్తమ్మ, సూపరింటెడెంట్ బి.కిషోర్, ఐటిడిఎ మేనేజర్ రాజు, సీనియర్ అసిస్టెంట్లు వేదవతి, వెంకటేశ్వరరావు, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం ధారకొండలో వాల్మీకి జయంతి నిర్వహించారు. స్థానిక రామాలయం ప్రాంగణంలో వాల్మీకి చిత్రపటాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మడిగుంట.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాల్మీకి గొప్పతనాన్ని వివరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ కొర్రారాము, గొర్లె జయరాజు(పాస్టర్) ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. మండల వాల్మీకి కమిటి అధ్యక్షులు గొర్లె అనుదీప్ కుమార్, మాజీ ఎంటిటిసి గొర్లె అనీల్ ప్రసాద్ (బాబీ) దూడ సువర్ణ కర్ణ కుమార్, లక్కొండ పాల్ బుజ్జి, లక్కొండ దావీదు, దూడ బ్రహ్మజీ పాల్గొన్నారు.

పాడేరుటౌన్: నాటి సమాజ అభివృద్ధిలో మహర్షి వాల్మీకి రచనలు ప్రముఖ పాత్ర పోషించాయని ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ అన్నారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపిఒ వెంకటేశ్వరరావు, ఎఒ హేమలత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాడేరు: నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్కుమార్ తదితరులు



సీలేరు: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పాడేరు: మానవాళికి రామాయణం లాంటి మహత్తరమైన గ్రంథాన్ని అందించిన మహానుభావుడు మహర్షి వాల్మీకి అని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కొనియాడారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతోత్సవం సందర్భంగా మంగళవారం పాడేరు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరలో వాల్మీకికి నివాళులరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మానవాళికి రామాయణం లాంటి ఒక మహత్తరమైన గ్రంథాన్ని అందించిన మహానుభావుడు వాల్మీకి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సాహిత్, జిల్లా రెవెన్యూ అధికారి కె పద్మలత, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మ్యూచువల్ ఫండ్స్ ఎస్ఐపిపై అవగాహన

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: ఎస్బిఐ మ్యూచువల్ ఫండ్స్ ఆధ్వర్యంలో పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం శుక్రవారం విశాఖలో ఎస్బిఐ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్బిఐ మ్యూచువల్ ఫండ్స్ అధికార ప్రతినిధి బి.సతీష్ మాట్లాడుతూ ఎస్ఐపిలు మధ్యలో ఆపితే సంపద సృష్టికి విఘాతం కలుగుతుందని మార్కెట్ ఒడిదుడు కులను ఎదుర్కొంటున్నప్పుడు చాలామంది పెట్టుబడిదారులు తమ సిస్టమేటిక్ ఇన్వెస్ట్మెంట్ ప్లాన్స్ (ఎస్ఐపి)లను విరమిస్తున్నారని తద్వారా రానున్న రోజుల్లో కలిగే ప్రయోజనాలను వారు కోల్పోతున్నారన్నారు. ఎస్ఐపిలను మధ్యలో ఆపివేయడం ద్వారా ఆర్థిక లక్ష్యాలు చేరుకోవడంలో జాప్యం ఏర్పడి రిటైర్మెంట్ తర్వాత వచ్చే నగదు తగ్గిపోతుందని మార్కెట్లు పతనమైనప్పుడు ఎస్ఐపీలు మెరుగ్గా పనిచేస్తాయని పెట్టుబడిదారులు మార్కెట్ ఒడిదుడు కులకు భయపడకుండా ఎస్ఐపిలను కొనసాగించాలని సూచించారు.


ఎంవిపి రైతు బజార్కు స్వచ్ఛాంధ్ర అవార్డు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని వారి చేతుల మీదుగా 69 మందికి అవార్డులు, మెమెంటోను అందించడం జరిగింది. కార్యక్రమంలో విశాఖపట్నం ఎంవిపి రైతు బజార్కు అవార్డు దక్కింది. ఈ అవార్డుని రాష్ట్ర రైతుబజార్ల సిఇఒ మాధవీలత, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్ రైతు బజార్ ఎస్టేట్ అధికారి వరహాలు అందుకున్నారు.

ఎస్డిఐతో హెచ్సిఎల్ అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ : ఆంధ్రప్రదేశ్లోని బలహీన వర్గాలకు చెందిన 30 మంది నిరుద్యోగ యువతకు పారిశ్రామిక వెల్డింగ్ పాత్రలో శిక్షణ అందించడానికి హిందూస్తాన్ షిప్యార్డ్ లిమిటెడ్ 7 అక్టోబర్ 2025న విశాఖపట్నంలోని స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్తో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొనేవారిని అవసరమైన వెల్డింగ్ నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం పారిశ్రామిక రంగంలో వారి ఉపాధిని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. డైరెక్టర్ (కార్పొరేట్ ప్లానింగ్ పర్సనల్) సిఎండిఇ రాకేశ్ప్రసాద్ ఈ బ్యాచ్ను ప్రారంభించారు.

పిఆర్ఎస్ఐ నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- మధురవాడ : పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ.) విశాఖపట్నం చాప్టర్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. మంగళవారం గీతం వర్సిటీలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో చైర్మన్గా హెచ్పిసిఎల్, విశాఖ రిఫైనరీ పిఆర్ఒ, సిఎస్ఆర్ కన్సల్టెంట్ ఎంకెవిఎల్ నరసింహం, వైస్చైర్మన్గా శంకర్ ఫౌండేషన్ సంస్థ పిఆర్ఒ బంగారురాజు, కార్యదర్శిగా విశాఖ డెయిరీ పిఆర్ఒ ఎ. గోవిందరావు, కోశాధికారిగా గీతం వర్సిటీ పిఆర్ఒ ఎన్వి. నరసింహం, కార్యవర్గ సభ్యులుగా ఎస్.శ్రీనివాస్కుమార్, ఎన్.నాగేశ్వరరావు ఎన్నిక య్యారు. ఎన్నికల అధికారిగా డిసిఐ. విశ్రాంత అధికారి, పిఆర్ఎస్ఐ. సీనియర్ సభ్యుడు కె..రామారావు వ్యవహరించారు. 1958లో స్థాపించబడిన పిఆర్ఎస్ఐ. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో విధులు నిర్వహిస్తున్న ప్రజాసంబంధాల అధికారులు (పిఆర్ఒ)ల వృత్తినిపుణుల జాతీయ సంస్థగా విస్తరించింది. వివిధ రాష్ట్రాలలో 30 ప్రాంతీయ శాఖలతో మూడు వేలకుపైగాసభ్యులను కలిగి ఉంది. ఇక విశాఖ చాప్టర్ పాతికేళ్లుగా క్రియాశీలకంగా కొనసాగుతూ, జాతీయస్థాయిలో గుర్తింపు పొందిందని రామారావు వెల్లడించారు. పిఆర్ఎస్ఐ. నేషనల్ కౌన్సిల్ మీటింగ్ను విశాఖపట్నంలో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని నూతన చైర్మన్ ఎంకెవిఎల్. నరసింహం తెలిపారు. నూతన కమిటీని అభినందించారు.

సీతారాం ఏచూరి భవనానికి డాక్టర్ వైఎల్ఎన్ రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : కామ్రేడ్ సీతారాం ఏచూరి స్మారక చిహ్నంగా పిఠాపురం కాలనీలో నిర్మిస్తున్న (సిపిఎం) విశాఖ జిల్లా కార్యాలయానికి విశాఖ నగరంలోని ప్రముఖ గైనకాలజిస్ట్, ప్రజావైద్యులు డాక్టర్ వై.ఎల్.ఎన్ నరసింగరావు మంగళవారం రూ.లక్ష భూరి విరాళం ఇచ్చారు. సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తరపున, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ధన్యవాదాలు తెలిపారు. జగ్గునాయుడు మాట్లాడుతూ, భవనం ప్రారంభమైనప్పటికీ, ఇంకా ఫర్నీచర్, లిఫ్ట్, మైక్సెట్, సోషల్మీడియా పరికరాలు, క్లాస్లకు అవసరమైన స్క్రీన్, ఎసిలు వంటివి ఇంకా సమకూర్చుకోవాల్సి ఉందన్నారు. డాక్టర్ వై.ఎల్.ఎన్ ఇచ్చిన చెక్కును భవన నిర్మాణ పర్యవేక్షకులు ఎం.త్రినాధరావు స్వీకరించారు.

ముగిసిన 'పోష్కన్' జాతీయ సదస్సు

ప్రజాశక్తి -ఎంవిపికాలనీ: ప్రాక్టిసింగ్ ఓరల్ పాథాలజిస్ట్స్ అండ్ మైక్రోబయాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలి జాతీయ సదస్సు 'పోష్కన్ 2025' అక్టోబర్ 4 ,5న ఆన్లైన్ ద్వారా విజయవంతంగా జరిగిందని ప్రాక్టిసింగ్ ఓరల్ పాథాలజిస్ట్స్ అండ్ మైక్రోబయాలజిస్ట్స్ అసోసియేషన్ డాక్టర్ భువన్నాగ్పాల్ , డాక్టర్ ఎం.నిహారిక తెలిపారు. భారతీయ ఓరల్ పాథాలజిస్టులు విద్యా, క్లినికల్ రంగాల్లో బలపడేలా చేయడం ఈ సదస్సు ముఖ్యఉద్దేశ్యం అన్నారు. ఓరల్ డయాగ్నస్టిక్స్, మైక్రోబయాలజీ, హెడ్ నెక్ ఆంకాలజీ, క్లినికల్ రీసెర్చ్, ల్యాబ్ మేనేజ్మెంట్ , హెల్త్కేర్లో డిజిటల్ ఇన్నోవేషన్స్ వంటి ప్రధాన అంశాలపై సమావేశాలు జరిగాయి. సదస్సులో 18 మంది దేశీయ, అంతర్జాతీయ ప్రముఖ వక్తలు ప్రసంగించారు. వారు ఓరల్ క్యాన్సర్ డయాగ్నోసిస్, హెడ్నెక్ ట్యూమర్లు, ప్రివెంటివ్ పాథాలజీ, యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్, ఫోరెన్సిక్ ఓడొంటాలజీ, బయోప్సీ టెక్నిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ డయాగ్నోస్టిక్స్ వంటి అంశాలను వివరించారు. వివిధ రాష్ట్రాల నుండి 250 మందికి పైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.